ప్రజాశక్తి
సోమవారం 11 నవంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

నిధుల కోసం నిరీక్షణ!

బడ్జెట్‌లో జిల్లాకు కేటాయించేనా? - నేటి నుంచి శాసనసభ సమావేశాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తొలిసారిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిల్లాకు కేటాయింపులపై ప్రజా ప్రతినిధులు, ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. గత ఆరు నెలలుగా ఓట్‌ఆన్ ఎకౌంట్ బడ్జెట్ అమలులో ఉండటం వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో సాధారణ నిధులు తప్ప జిల్లాకు కేటాయింపులేమీ దక్కలేదు. ఉమ్మడి జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలకు ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై మోక్షం లభిస్తుందా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది.

వరికపూడిసెల, గుంటూరు ఛానల్, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి, గుంటూరు నగరపాలక సంస్థలో అభివృద్ధి పనుల జాప్యం, యూజిడి, ఆర్‌యుబి, ఆర్‌వోబిల అంశాలతో పాటు మెడికల్ కళాశాలలో మౌలిక వసతులు, పాఠశాల దుస్థితి, ఉపాధ్యాయులు కొరత, పాఠశాలల విలీనం నిర్ణయాల వల్ల ఏర్పడిన ఇబ్బందులు, డిఎస్‌సి నోటిఫికేషన్లు, నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ, రహదారుల అభివృద్ధికి నిధులు, మౌలిక వసతులు తదితర అంశాలపై



బడ్జెట్ సమావేశంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారనేదీ ప్రజల్లో ఆసక్తి నెలకొంది. పల్నాడు జిల్లాలో వరికపూడిసెల ఎత్తిపోతల పథకానికి ఇప్పటికే పలుమార్లు శంకుస్థాపన చేసినా ఇంత వరకు నిధులు కేటాయింపు జరగలేదు. గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపు పనులు ఇంత వరకు ప్రారంభం కాలేదు. భూ సేకరణకు కూడా నిధులు కేటాయింపు లేకపోవడం వల్ల ఈ పనులన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. గుంటూరు నగరంలో యూజిడి పనులు నిలిచిపోయి ఐదున్నర ఏళ్ల గడచిపోయాయి. కొన్నేళ్లుగా కాల్వల ఆధునికీకరణకు నిధులు కేటాకయించడం లేదు.

ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 17 నియోజకవర్గాల్లో కూటమి ఎమ్మెల్యేలున్నారు. వీరిలో ముగ్గురు మంత్రులున్నారు. నారా లోకేష్, నాదెండ్ల మనోహర్,

▶ 2లో

మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

అటవీ శాఖ అమరుల త్యాగాలను వృథా కానివ్వం

- భావితరాలు గుర్తుంచుకునేలా విగ్రహాల ఏర్పాటు
- భవనాలకు అమర వీరుల పేర్లు : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-గుంటూరు

అటవీ శాఖ అమరవీరుల త్యాగాలను వృథా కానివ్వబోమని, ప్రకృతి ప్రసాదించిన వన సంపదను భవిష్యత్తు తరాలకు అందించేందుకు అమరవీరుల త్యాగాలను స్ఫూర్తితో కృషి చేద్దామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అన్నారు. ఆదివారం గుంటూరు కలెక్టరేట్ రోడ్డులోని

▶ 2లో

మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

విద్యుత్ భారాల బాదుడు వద్దు

2

ఆదర్శమూర్తికి అశ్రునివాళి

లోతైన ఆలోచన భావాలను ఒడిసి పట్టి అతి సామాన్యుడికి చేరువయ్యే చిత్ర రాజనాలను అందించిన మీరు కడు ధన్యజీవులు.
గుంటూరు లోగో నందించి జిల్లా స్థాయి ఖ్యాతిని ఇనుమడింప చేసుకున్నారు. క్రొత్త జిల్లా ఆవిర్భావం సందర్భంగా
చిత్రలేఖనాల పోటీలకు న్యాయమూర్తి వై ఘనత సాధించారు. చిత్రలేఖనాలలో మీరు ఘనాపాఠి.
జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మీ లేఖనాలనుండి వెలువడిన చిత్ర రాజనాలకు బహుమతులెన్నెన్నో.....
సత్తెనపల్లి పట్టణ కీర్తి కిరీటాన్ని ప్రపంచ పటంలో వెలుగొందించారు.
11వ అంతర్జాతీయ చిత్రలేఖన అవార్డును కేంద్ర ఆమాత్యుల ద్వారా స్వీకరించుటకు అర్హత సాధించిన మీరు మహాచిత్రకారులు.
మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలికి చిత్ర భాష్యం చెప్పిన ప్రపంచంలోనే తొలి చిత్రకారులైన
మీరు ఎల్లప్పుడూ చిరస్మరణీయులే...జింకా అంటేనే చిత్రలేఖనాల రారాజు. మీ స్ఫూర్తిని ఎందరో
మరెందరో కొనసాగించాలని కోరుతూ... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ...



జననం : 29-11-1946
మరణం : 01-11-2024

కీ॥శే॥ జింకా రామారావు గారు
ప్రపంచ ప్రఖ్యాత చిత్ర కళాకారులు, సత్తెనపల్లి.

కుమారులు - కోడళ్ళు, కుమార్తెలు - అల్లుళ్ళు
మనుమలు, మనుమరాండ్రు మరియు బంధుమిత్రులు

పెద్దకర్మ : ది.11-11-2024 సత్తెనపల్లిలోని అయ్యప్పస్వామి గుడి వెనుక,
శ్రీ వెంకటేశ్వర రెసిడెన్సీలోని మా స్వగృహమునందు జరుగును. తెలియపర్చడమైనది.

వైసిపికి చెందిన వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : మండలంలోని జూలకల్లులో వైసిపికి చెందిన నర్రెడ్డి లక్ష్మారెడ్డిపై ఆదివారం దాడి జరిగింది. పట్టణ సిఐ వెంకట్రావ్ వివరాల ప్రకారం.. జూలకల్లుకు చెందిన చల్లా మణమ్మతో లక్ష్మారెడ్డికి పొలం వివాదం ఉంది. గతంలో పలుమార్లు గొడవలయ్యాయి. ఈ క్రమంలో లక్ష్మారెడ్డి ఆదివారం పొలం వద్ద ఉన్న చల్లా మణమ్మను దుర్భాషలాడగా ఆమె తన కుమారుడు రాజేష్ చెప్పారు. దీంతో సాయంత్రం 4 గంటలప్పుడు పొలం నుండి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న లక్ష్మారెడ్డిని రాజేష్, మరికొంతమంది కలిసి ఇనుప రాడ్డుతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. గత ఎన్నికల్లో వైసిపి కోసం చురుగ్గా పని చేసినందువల్లే ఈ దాడి జరిగిందని కుటుంబీకులు చెబుతున్నారు. దాడిలో లక్ష్మారెడ్డికి రెండు కాళ్లు, కుడి చేయి విరిగినట్లు వైద్యులు చెప్పారని అన్నారు.

రేపు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పెదకూరపాడు : నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడుకు చెందిన కవిబ్రహ్మ ఏటుకూరి వెంకట నర్సయ్య 75వ వర్ధంతి సందర్భంగా మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని పెదకూరపాడు అభివృద్ధి వేదిక కన్వీనర్, ప్రజాకవి దర్శి శేషారావు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు ఉంటాయని తెలిపారు. పెదకూరపాడు జెడ్పి పాఠశాలలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతాయని తెలిపారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువాపై వ్యాసం రాయాల్సి ఉంటుందని, వివరాలకు 8790682858, 8309754060, 7013 511748 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- మాచర్ల : శ్రీశైలం రోడ్‌లో గల స్వామి వివేకానంద సేవాశ్రమం నందు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను ఆదివారం శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు కొంతమేరకైనా ఉపాధి దొరకాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని, ఆ మేరకు ముందుగా కంప్యూటర్ బేసిక్స్‌ను ఉచితంగా నేర్పేందుకుశిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. గత వేసవి సెలవుల్లో కూడా విద్యార్థిని, విద్యార్థులకు అనేక మందికి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ముందుగా కంప్యూటర్ టీచర్ నాగ సురేష్ కుమార్‌తో కలిసి స్వామి వివేకానంద చిత్రపటానికి మెట్టు గోవిందరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. సేవాసమితి సభ్యులు ఎం.పాపిరెడ్డి, షేక్ చినలాలు సాహెబ్, ఉపాధ్యాయులు గంఢ్రకోట ప్రసాద్, చంద్రరావు పాల్గొన్నారు.

మెడికల్ హబ్ గా నరసరావుపేట అభివృద్ధి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం మెడికల్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టంలోని పల్నాడు రోడ్డులో సుప్రజ హాస్పిటల్, అరండల్‌పేటలో డాక్టర్ అర్పిత ఫెటల్ మెడిసిన్ సెంటర్‌ను ఎంపీ ఆదివారం ప్రారంభించారు. వైద్య వృత్తిని వ్యాపారం మాదిరి కాకుండా సేవ, అంకితభావంతో నిర్వహించాలని చెప్పారు. ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పిడుగురాళ్లలో మెడికల్ ఆసుపత్రి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇది పల్నాడు ప్రజలకు వరంగా మారనుందని చెప్పారు. మరోవైపు హైవేలు కూడా అభివృద్ధి చెందుతున్నాయని, పల్నాడు ప్రజలకు మంచి రోజులు రానున్నాయని అన్నారు.

విద్యుత్ భారాల బాదుడు వద్దు

ప్రజాశక్తి-తాడేపల్లి

ట్రూ అప్ ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన ప్రజాపోరు ప్రచారయాత్రను ఆయన తాడేపల్లిలో ఆదివారం ప్రారంభించారు. అనంతరం ముగ్గురోడ్డు, పోతురాజు స్వామి గుడి, రన్నింగ్ రూమ్ సెంటర్, మున్సిపల్ జోనల్ కార్యాలయం, నెహ్రూ బొమ్మ సెంటర్, అంజి కొట్టు సెంటర్, బోసు బొమ్మ సెంటర్‌లో ప్రచారం సాగింది. సుందరయ్య నగర్‌లో మాలకొండారెడ్డి కాంప్లెక్స్, లీలా సుందరయ్య కళావేదిక, మాలకొండారెడ్డి స్థూపం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని హామీనిచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు రూ.18 వేల కోట్ల భారం మోపిందని విమర్శించారు. దీనిద్వారా వైసిపి ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి విధానాల్లో తేడా లేదనే విషయం మరోసారి స్పష్టమైందన్నారు. ఎన్నడూ లేనివిధంగా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరిగాయని చెప్పారు. ఉచిత ఇసుక విధానం నేటికీ అమలులోకి రాలేదని, గత ప్రభుత్వంలో మాదిరిగానే ట్రాక్టర్ ఇసుకను రూ.10 వేలకు కొనాల్సి వస్తోందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయని చెప్పారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు, జరుగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన దూకుడు కొనసాగిస్తోందని, అధికారం కోసం మతాన్ని వాడుకుంటోందని అన్నారు. జెమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందన్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన రాష్ట్రంలోని అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికలను కూడా కేంద్రం తన పరిధిలోకి తీసుకొని ప్రజాస్వామ్య సూత్రాలకు విఘాతం కలిగిస్తోందన్నారు. ఒకే దేశం, ఒకే మతం, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే నాయకుడు అనే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని అమలు చేయబూనుకుందని మండిపడ్డారు. ఈ చర్యలను వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ప్రతిఘటనిస్తాయని, ప్రజలందరూ కలిసి రావాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు జి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ పెరిగిన ధరలను తగ్గించాలని కోరుతూ ఈనెల 14వ తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సుందరయ్య నగర్‌లో జరిగిన కార్యక్రమంలో నాయకులు కె.గడ్డన్న, కె.కరుణాకర్ రావు, ఎస్ గిరిజ, భుజంగరావు, పద్మ, భవాని, ఖాజావలి, బి.రామారావు, కె.ప్రభాకర్, ఎల్.సత్యం, జ్యోతి, వెంకటేశ్వరరావు ఎం. త్రిమూర్తులు, శ్రీనివాసులు, ప్రసన్న, తాడేపల్లి సెంటర్లో డి.శ్రీనివాస్ కుమారి, డి.విజయ్‌బాబు, కె.బాబురావు, పి.రామారావు, బాబు, శాంతారావు, బి.గోపిరెడ్డి, కె.శీను, జి.అంజిరెడ్డి, ఎం.లీలమ్మ, గంజి శ్రీనివాసరావు, పిరోజ్ ఖాన్, ఎస్కే సుభాని, ఎమ్‌డి బాజ్జి, చింత శ్రీరామ్ పాల్గొన్నారు.

ప్రజాపోరు ప్రచార యాత్ర ప్రారంభంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రమైన రొంపిచర్లలోని చెరువుకట్ట కూడలి నుండి పోలీస్ స్టేషన్ వరకు ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరాజు మాట్లాడారు. ఎ.ఫణీంద్ర, పి.రామి రెడ్డి, పి.కోటేశ్వరరావు, పి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

అటవీ శాఖ అమరుల త్యాగాలను వృథా కానివ్వం

(మొదటి పేజీ తరువాయి)

అరణ్యభవన్‌లో జరిగిన అటవీ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, జెడ్పీ ఛైర్ హెనీ క్రిస్టీనా, ఎమ్మెల్యేలు నసీర్ అహమ్మద్, గల్లా మాధవి, బి.రామాంజనేయులు, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరితో కలసి అమర వీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ అటవీ సంపద దోచుకునే స్మగ్లర్లు, అరాచక మూకలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించి, వీర మరణం పొందిన అటవీ సిబ్బంది త్యాగాలు వృథా కానివ్వకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా మనం పని చేయాలన్నారు. అటవీ సంపద పరిరక్షణలో ఒక ఐఎఫ్ఎస్ అధికారితో పాటు 23 మంది సిబ్బంది తమ అమూల్యమైన ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. భూమ్మీద మనతో పాటు సహజీవనం చేస్తున్న జంతువులు, చెట్లు చేమలు, పశు పక్షాదులను రక్షించే బాధ్యత మనందరిదని చెప్పారు. సిబ్బంది, నిధుల కొరత ఉన్నా వాటిని అధిగమించి అటవీ శాఖను బలోపేతం చేస్తామన్నారు. అటవీశాఖలో సిబ్బంది కొరత ఉన్నా అధికారులు నిబద్ధతతో పని చేస్తున్నారన్నారని అభినందించారు. రాజకీయ నాయకులు వాళ్ల ముందర కాళ్లకు బంధాలు వేయకుండా వాళ్ల పని వాళ్లను చేసుకోనిస్తే సరిపోతుందన్నారు. అటవీ సంపద సంరక్షణలో ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్, కీర్తిచక్ర అవార్డు గ్రహీత పందిళ్లపల్లి శ్రీనివాస్‌తో సహా 23 మంది ఫారెస్ట్ అధికారులు అశువులు బాశారని, గంధపు చెక్కలు, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్‌తో పోరాటం చేసి శ్రీనివాస్ ప్రాణాలు వదిలారని గుర్తు చేశ్నారు. వారి త్యాగాలను భవిష్యత్ తరాలు గుర్తించుకునేలా విగ్రహాల ఏర్పాటు, నగర వనాలు, అటవీ శాఖ భవనాలకు వారి పేర్లు పెడతామన్నారు. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడానికి తెచ్చిన సంజీవని పథకానికి పారిశ్రామికవేత్తలు, దాతలతో మాట్లాడి రూ.5 కోట్లు సమీకరిస్తామని తెలిపారు. చెట్లు, వన్య ప్రాణులను కాపాడుకోవడానికి బిష్ణోయ్ తెగ ఎంత వరకైనా వెళ్తుందని, జోద్‌పూర్ రాజు చేపట్టిన చెట్లు నరికివేతకు వ్యతిరేకంగా అమృతా దేవి నాయకత్వంలో బిష్ణోయ్ తెగ శాంతియుతంగా పోరాడి వందల సంఖ్యలో ప్రాణాలను అర్పించిందని అన్నారు. రాజు సైన్యంపై ఎదురుదాడి చేయకుండా చెట్లను కౌగలించుకొని సైన్యం చేతిలో వీరమరణం పొందారని, ఆ కోవకు చెందిన వ్యక్తులే మన అమరవీరులని అన్నారు. ఇలాంటి వారినే స్ఫూర్తిగా తీసుకొని అటవీ సంపద సంరక్షణ కోసం సుందర్ లాల్ బహుగుణ చిప్కో ఉద్యమం చేశారని తెలిపారు. అటవీశాఖ తన చేతిలో ఉన్నంత వరకు ఎలాంటి సంస్కరణలు తీసుకొస్తే ప్రజలకు మేలు జరుగుతుందో అలాంటివి సంస్కరణలు తప్పకుండా తీసుకొస్తానని చెప్పారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, నగరపాలక సంస్థ కమిషనర్ పి.శ్రీనివాసులు, అటవీశాఖ ఉన్నతాధికారులు కజురియా, ఎస్.ఎస్.శ్రీధర్, రాహుల్ పాండే, డిప్యూటీ మేయర్ సజీలా, అటవీ శాఖ అధికారులు, అటవీ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిధుల కోసం నిరీక్షణ!

(మొదటి పేజీ తరువాయి)

అనగాని సత్యప్రసాద్ వారి నియోజకవర్గాలకైనా ఎక్కువ నిధులు రాబట్టుకోగలరా అన్న అంశం సందేహాస్పదంగా మారింది. శాసన సభలో ప్రతిపక్షం లేనందున శాసన మండలిలో ప్రతిపక్షంగా వైసిపి కీలకంగా వ్యవహరించే అవకాశం ఉంది. ప్రధానంగా మండలిలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వైసిపి ఎమ్మెల్సీలు ఎల్.అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతరావు, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కల్పలత హాజరువుతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శాసన సభలో బలం లేనందు వల్ల వైసిపికి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు వెళ్లడం లేదని, మండలిలో బలం ఉన్నందున జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వారు హాజరు అవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మండలి సమావేశాలకు పూర్తిస్థాయిలో హాజరువుతూ జిల్లాకు చెందిన పలు అంశాలను ప్రతిసారి ప్రస్తావిస్తూ వివిధ పథకాలకు నిధులు విడుదల కేటాయించాలని, ఈ పథకాల వల్ల ప్రజలకు ఒనగూరే ప్రయోజనాలను వివరించి ప్రభుత్వంపై వత్తిడి పెంచుతున్నారు. మొత్తంగా బడ్జెట్ సమావేశాల్లో జిల్లాకు సంబంధించిన అంశాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏమేరకు ప్రస్తావిస్తారు? చర్చల్లో ఎంత వరకు పాల్గొంటారన్నదీ వేచిచూడాల్సిందే.

వైసిపి సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : టిడిపి, జనసేనకు చెందిన ముఖ్యమైన మహిళా నాయకుల ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్న వైసిపికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త బద్దం అశోక్‌రెడ్డిని మంగళగిరి రూరల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు డీఎస్పీ సిహెచ్ మురళికృష్ణ తెలిపారు. తెలంగణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా మెండోరాకు చెందిన నిందితుడు ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడని, పలువురిపై అసభ్యకర పోస్టులు పెట్టారని చెప్పారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి-తాడేపల్లి

జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావును ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా జనసేన పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తిరుపతిరావు మాట్లాడుతూ జనసేన నాయకులు జొన్న రాజేష్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారు ఒకసారి ఆలోచించి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎం.చాముండేశ్వరి దేవి, ఎం.మాధవి, కె.దినేష్ చక్రవర్తి, కె.మణికంఠ, సిహెచ్.వెంకటేశ్వరరావు, వి.శివప్రసాద్, వి.వెంకటేశ్వర్లు, దుర్గాబాబు, కె.శంకర్, పి.రమేష్, సిహెచ్.వెంకటస్వామి, ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన దలాయి సంగీత తండ్రి దలాయి బాల కృష్ణ, భర్త పిన్నమనేని రామచంద్రరావు, నివాసం: డోర్.నెం.2-14-117/31/ఎ, 6వ లైను ఎక్స్‌టెన్షన్, శ్యామల నగర్, సీతారామ్ నగర్ కాలనీ, గుంటూరు సిటీ వారి వద్ద నుంచి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా. నా క్లయింటు తియ్యగూర అచ్చిరెడ్డి వగైరాల వద్ద నుంచి గుంటూరు డిస్ట్రిక్ గుంటూరు సబ్-డిస్ట్రిక్ నల్లపాడు గ్రామం బాపతు డి.నెం.185రు మింజుమలె ప్లాటు నెం.7, చ.గ.245.3/9 ర్లు స్థలం కొనుగోలు చేసి తన పేరు మీద ది.13-08-1990వ తేదీన విక్రయ దస్తావేజు వ్రాయించుకుని దానిని గుంటూరు సబ్-రిజిస్ట్రారు వారి కార్యాలయం నందు ద.నెం.5892/1990 గా రిజిష్టర్ చేయించుకొని ఉన్నారు. నా క్లయింటు ది.01-11-2024వ తేదీన పై తెలిపిన ఒరిజినల్ దస్తావేజును ఫోటోస్టాట్ తీయించుకొను నిమిత్తం పట్టాభిపురంలోని ఓ జీరాక్స్ షాపు నందు ఫోటోస్టాట్ తీయించుకొని తన ఇంటి వద్దకు వెళ్ళి చూసుకొనగా పై తెలిపిన ఒరిజినల్ దస్తావేజు కనిపించుటలేదు. కావున ఎవరికైననూ పైన తెలిపిన ఒరిజినల్ దస్తావేజు దొరికిన యెడల సదరు దస్తావేజును నా క్లయింటుకు గాని ఈ క్రింద అడ్రసుకు సమాచారం ఇవ్వగలరని కోరుతున్నాము.

యడ్లపల్లి కోటేశ్వరరావు, అడ్వకేట్,
2/18 బ్రాడీపేట, గుంటూరు,
సెల్.నెం.9397107449.

ప్రజాశక్తి

గుంటూరు, పల్నాడు 3

సోమవారం 11 నవంబర్ 2024

మీరంతా మట్టిలో మాణిక్యాలు

పూర్వ విద్యార్థుల చేయూత కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి -తాడికొండ

నేలపై కూర్చున్న మీరందరూ మట్టిలో మాణిక్యాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, టెలి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం తాడికొండలోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల పూర్వ విద్యార్థుల చేయూత కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ముందుగా పూర్వ విద్యార్థుల సహకారంతో ఆధునికరించిన ఉపాధ్యాయుల క్వార్టర్స్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గొప్ప సాధన, గొప్ప ఆశయం, గొప్ప బోధన శోధన కలిస్తే తాడికొండ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులని అన్నారు. తాము కూడా నేలపై కూర్చొని కష్టపడి చదివితే ఈరోజున ఈ స్థితిలో ఉన్నామన్నారు. పాఠశాలలో వసతులున్నా, లేకున్నా పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలు అందుకుంటారని చెప్పారు. ఈ పాఠశాలలో చదివిన ఎంతోమంది ఐఎఎస్‌లుగా, ఇంజినీర్లుగా ఉన్నారని చెప్పారు. విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలకు మరవకుండా పాఠశాలకి అభివృద్ధికి సహకరించడం మంచి విషయమన్నారు.

మాట్లాడుతున్న పెమ్మసాని

పాఠశాలల అభివృద్ధికి తానూ సహకరిస్తానని చెప్పారు. ప్రతి గ్రామానికి వెళ్లి ఆ గ్రామానికి పాఠశాల, సామాజిక భవనాలను, ఎంపి నిధులు నుండి సిఎస్ఆర్ ఫండ్స్ నుండి సాధ్యమైనంత వరకు సహాయం చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ టీచర్స్ తమకు జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంపీకి వినతి పత్రాన్ని ఇచ్చారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రెటరీ విఎన్ మస్తానయ్య, తహశీల్దార్ నాసరయ్య ఎంపిడిఒ సమతా వాణి, ఎంఇఒ తెనాలి ఇందిరా, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వై.వి.ఆంజనేయులు తదితరులు

చలపతిలో దూర విద్య పీజీ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

చలపతి డిగ్రీ కాలేజీలో ఏర్పాటైన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యాకేంద్రం అనుబంధంతో పోస్ట్ గ్రాడ్యుయేట్స్ సైన్స్ విభాగంలో 12 కోర్సులను 2024-2025 విద్యా సంవత్సరం నుండి ప్రారంభం అయ్యాయని చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు తెలిపారు. ఈకోర్సులకు సంబంధించిన కర పత్రాలను ఆదివారం వై.వి.ఆంజనేయులు విడుదల చేసి, వివరాలను మీడియాకు తెలియజేశారు. చలపతి డిగ్రీ కళాశాల కేంద్రంగా ఏర్పాటైన దూర విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్స్ సైన్స్ విభాగంలో ఎంఎస్సీ (బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, మ్యాథమెటిక్స్, స్టాటిక్స్టిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ మరియు సైకాలజి)తో పాటు ఎంబిఎ, ఎంసిఎ కోర్సులను ఈవిద్యా సంవత్సరం నుండి అడ్మిషన్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆయా కోర్సులలో చేరదలచిన వారు ష్ట్రజూం://ఖఅబఎనవ.శీతీస్త్ర/ఖుంప్త్రఎశీఖతీఎం/ఖుఖుశ్రీప్-అఎం వెబ్‌సైట్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చున్నారు. అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం చలపతి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో క్లాసులు నిర్వహిస్తామని చెప్పారు. అంతేకాకుండా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020కి అనుగుణంగా ప్రతి విద్యార్థి ఫార్మసీ, ఇంజినీరింగ్‌తో పాటు అదనంగా ఒకటిగానీ, రెండు డ్యూయల్ డిగ్రీ పొందే అవకాశం కల్పించటం జరిగిందని చెప్పారు.

కాకాని శ్రీమల్లేశ్వర స్వామి దేవస్థానంలో సందర్శకుల కిటకిట

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మండల కేంద్రమైన పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తీకమాసం 2వ ఆదివారం సందర్భంగా సందర్శకులు పోటెత్తారు. యజ్ఞాల బావి వద్ద కార్తీకమాస స్నానమాచరించిస్వామి వారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదేశంలో కార్తీక దీపారాధనలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన క్యూలైన్ల ద్వారా ఆటంకం లేకుండా స్వామి అభిషేకాలు నిర్వహించారు. సందర్శకులకు పాలు, మజ్జిగ, తాగునీరు అందించారు. దేవాలయ అన్ని విభాగాలను ఆలయ ఉపకమిషనరు కెబి.శ్రీనివాసరావు పరిశీలించారు. పలు విరాళాలు ద్వారా రూ.6 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ సొంత భవనం ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటి నూతన భవనాన్ని తెనాలి మండలం అంగలకుదురు జెండా చెట్టు కూడలిలో బ్యాంకు చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతరావు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. బ్యాంక్ కౌంటర్‌ను ఆడిటర్ హరిబాబు ప్రారంభించగా, రోటరీ క్లబ్ మాజి గవర్నర్ ఈదర వెంకటపూర్ణచంద్ స్ట్రాంగ్ రూంను ప్రారంభించారు. తొలుత సొసైటి చైర్మన్ లక్ష్మీకాంతరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జి.చంద్రమౌళి, దావులూరి చక్రధర్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. సొసైటి ఆవిర్భావంలో అప్పటి చైర్మన్ దావులూరి సోమశేఖరరావు అందించిన సేవలను వక్తలు స్మరించుకున్నారు. లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ అంగలకుదురులో కాకతీయ కో-పరేటివ్ సొసైటీ మొదటి శాఖ కాగా ఉన్న పది బ్రాంచీల్లో ఐదవ సొంతభవనాన్ని ఏర్పరచుకోవడం ఆనందంగా ఉందన్నారు. సొసైటి ద్వారా ఇప్పటివరకు 70 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. బిజెపి నాయకులు యడ్లపాటి స్వరూపారాణి మాట్లాడుతూ ఖాతాదారులకు నమ్మకాన్ని కలిగిస్తూ, మరిన్ని శాఖలతో విరాజిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశన శంకరరావు మాట్లాడుతూ సొసైటి అభివృద్ధికి, శాఖలు విస్తరణకు ముఖ్య కారకులైన లక్ష్మీకాంతరావును అభినందించారు. కార్యక్రమంలో జిడిసిసి బ్యాంకు మాజి అధ్యక్షులు మారౌతు సీతారామయ్య, టిడిపి నాయకురాలు జెట్టి రేణుక, మాజి ఎంపిపిలు మైనేని రత్న ప్రసాద్, కేశన కోటేశ్వరరావు, సూర్యదేవర వెంకట్రావు, న్యాయవాది వెలినేని రాఘవయ్య పాల్గొన్నారు.

సిపి బ్రౌన్ జయంతి సందర్భంగా నివాళి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

శ్రీ శ్రీ కళావేదిక గుంటూరు జిల్లా కమిటి ఆధ్వర్యంలో సిపి బ్రౌన్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాజరుపేటలో కమలశ్రీ నిలయంలో ఏర్పాటు చేసిన సాహిత్య సభకు శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు రంగిశెట్టి రమేష్ అధ్యక్షత వహించి మాట్లాడారు. తెలుగు తన మాతభాష కానప్పటికి, తెలుగు భాష గొప్పదనాన్ని గుర్తించి, తెలుగు తియ్యందనాలను, తెలుగు భాషా వికాసానికై తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలి సి పి బ్రౌన్ అన్నారు. జిల్లా కమిటి ప్రధాన కార్యదర్శి ఆళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాష వ్యాప్తికి అలుపెరగక పోరాడిన తెలుగు భాషా ప్రేమికుడు చార్లెస్ పిలిప్స్ బ్రౌన్ అన్నారు. తన సొంత ధనాన్ని వెచ్చించి కవి పండితులను పోషించారన్నారు. తెలుగులో పుస్తకాలు ప్రచురించి ఉచితంగా పంపిణి చేసిన త్యాగశీలి సిపి బ్రౌన్ అన్నారు. తెలుగు భాషా వికాసం, కవుల కర్తవ్యం అనే అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనంలో స్థానిక సాహితీవేత్తలు, ప్రముఖ పద్య కవి విష్ణుమొలకల భీమేశ్వర ప్రసాద్, గాయకుడు, కళాకారుడు కొప్పరాజు విజయ సారధి బాబు, ప్రముఖ బాల సాహితీవేత్త షేక్ అబ్దుల్ హకిమ్ జాని, చందు సూర్య, ఈమని ప్రేమకుమార్, పాతూరి సుబ్రహ్మణ్యం, యం.వి రఘునాధరావు, ఆళ్ళ సుజాత, మానేపల్లి నరసింహాచారి తదితరులు తమ స్వీయకవిత, గానాలతో బ్రౌన్‌కు నివాళిలర్పించారు.

ఎపిఆర్‌డిసి ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఆంధ్రప్రదేశ్ గురుకుల డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం వాలంటీర్లు కృష్ణా ఘాట్ వద్ద ఆదివారం శ్రమదానం చేశారు. సందర్శకులు ఎక్కువగా వస్తున్న ఈ ఘాట్ వద్ద ముళ్ల కంప, ఇతర వ్యర్థాలు ఎక్కువగా ఉండి నడవడానికి ఇబ్బంది మారింది. దీంతో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఇక్కడ శుభ్రం చేశారు. క్రయవిక్రయాలు చేసేవారు ఈ చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కె.మొహమ్మద్ బాష పర్యవేక్షించారు.

ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

రూ.25లక్షలు తీసుకున్న వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి - రెంటచింతల

ఎస్సై ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఓ విద్యార్థినివద్ద రూ.25 లక్షలు తీసుకున్న వ్యక్తిపై ఎస్ఐ సిహెచ్ నాగార్జున ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి మండల కేంద్రమైన రెంటచింతలలోనే ఎర్రబాలెం చెందిన షేక్ మస్తాన్ బి డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు హాజరయ్యే నిమిత్తం పేరేచర్లలోనే ఓ ఎగ్జామ్స్ సెంటర్‌కు వెళ్ళింది. అక్కడ పరిచయమైన ఒంగోలు వాసి లోకేష్ రెడ్డి ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి విడతల వారీగా రూ. 25 లక్షలు వసూలు చేశాడు. రేపో మాపో ఎస్సై శిక్షణకు సిద్ధం కావాలంటూ మెసేజ్ పెట్టేవారు. చివరికి ఇది ఫేక్ అని తెలియడంతో గురువారం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇసుకరేవు వద్ద ఘర్షణలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - కొల్లిపర

ఇసుక రేవులో జరిగిన వివాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం రేవులో ఆదివారం నెలకొంది. బాధితుని కుటుంబ సభ్యుల వివరాలు ప్రకారం తూమాటి రాజేంద్రప్రసాద్ ఇసుక రేవులో పని ముగించుకొని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన దోసరి అనిల్, చిన్న బాజీ, అంజి , హరీష్ బాబు కిషోర్ తదితరులు దాడి చేశారని తెలిపారు. తీవ్రంగా గాయపడిన తూమాటి రాజేంద్రప్రసాద్ ను కొల్లిపర ప్రాథమిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జి జి హెచ్ కు తరలించారు. కొల్లిపర పోలీసులు వివరాలు సేకరించి నిందితులను అదుపులోనికి తీసుకున్నారు.

10 మంది జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - కొల్లిపర

కొల్లిపర మండలం చక్రాయపాలెం డొంకలో పేకాడుతున్న నలుగురిని ఆదివారం అదుపులో తీసుకున్నట్లు ఎస్సై పి కోటేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుండి రూ.44000 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కొల్లిపర మండలం తూములూరు శివారులో కోడిపందాలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను ఆదివారం అదుపులో తీసుకొని నట్లు ఎస్సై పి కోటేశ్వరావు తెలిపారు. వారి వద్ద నుండి రూ.4000 నగదు ఒక కోడిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపాడు.

వన భోజనాలు ముసుగులో పేకాట

ప్రజాశక్తి ప్రత్తిపాడు

వనభోజనాల ముసుగులో జూదమాడుతున్న పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.96,300నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడు సిఐ గన్నవరపు శ్రీనివాసరావు వివరాలు తెలిపారు. మండలంలోని ఎన్‌హెచ్ 16 గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లేదారిలో ఉన్న షెడ్డులో ప్రత్తిపాడు, చిన్న కొండ్రూపాడు, గోట్టిపాడు, యనమదల గ్రామాలకు చెందిన వ్యక్తులు పేకాట ఆడుతున్న సమాచారంతో 38మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

విజేతలకు బహుమతులను అందజేస్తున్న చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరిలో నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

తొమ్మిదవ నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు ఆర్గనైజింగ్ బై జపాన్ సిటోరియో కరాటే ఏపీ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి పట్టణంలోని ఈద్గా షాదిఖానా హాల్లో జరిగాయి తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర నుండి 600 మంది పాల్గొన్నారు. పోటీలను ఏపీ చీఫ్ మాస్టర్ అడిషనల్ ఎస్పీ వి.గణేష్‌బాబు ప్రారంభించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం విజేతలకు ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. డిజిపి కార్యాలయ పిటిఓ, డిఎస్పి వాసు, ఆర్గనైజర్ డి.ప్రభాకర్ పాల్గొన్నారు.

బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కల్పిస్తాం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఉచిత రక్తనాళాల పరీక్షా శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. తెనాలి బస్టాండ్ ఔట్ గేట్ ఎదురుగా గల ఈగల్ రెస్టారెంట్ సమావేశపు కార్యాలయంలో ఉచిత రక్తనాళాలు పరీక్షలు నిర్వహించినట్లు రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షులు ఈదర శ్రీనివాసరావు అన్నారు. ప్రముఖ ఏషియన్ వాస్కులర్ ఆసుపత్రి హైదరాబాద్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 300 మందికి పైగా పరీక్షలు నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ తెనాలి పరిశర ప్రాంతంలో నరాలు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు ఈ ఉచిత వైద్య శిబిరం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. బోధకాలు, వెరికోస్ వెయిన్స్ సమస్యలపై పరీక్షలు నిర్వహించినట్లు ఇంటర్ క్లబ్ రిలేషన్ జోనల్ చైర్మన్ ఈదర వెంకట పూర్ణచంద్ తెలిపారు. రోటరీ క్లబ్, ఏషియన్ వాస్కులర్ ఆసుపత్రి సంయుక్త నిర్వహణలో 300 మందికి పైగా రక్తనాళాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేశామని డయాగ్నస్టిక్స్ అండ్ హైజాన్ జోనల్ చైర్మన్ కన్నెగంటి మురళీకష్ణ అన్నారు. త్వరలో రోటరీ క్లబ్ తరపున బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు మెమోగ్రామ్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. స్త్రీలలో వచ్చే బ్రెస్ట్ క్యాన్సర్‌పై సమాజాన్ని జాగతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యకమంలో కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, ఫౌండేషన్ జోనల్ చైర్మన్ గుత్తా వెంకటరత్నం, జీవి నారాయణ, జాస్తి నరేంద్ర, కాకుమాను ఉపేంద్ర, కెవి సుబ్బారావు, కొల్లి రాజేంద్రప్రసాద్, ఆలపాటి వెంకటరామయ్య, మల్లాది అర్జున్, రాజశేఖర్ రెడ్డి, షేక్ సుభాని, ఆలపాటి కిరణ్ పాల్గొన్నారు.

బెల్టు షాపులను ఉపేక్షించం

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎ.ముప్పాళ్ల, ఈపూరు గ్రామాల్లోని మద్యం షాపులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆదివారం తనిఖీ చేశారు. ఎంఆర్‌పి ధరలకే మద్యాన్ని విక్రయించాలని, 21 ఏళ్లలోపు వారికి మద్యం అమ్మొద్దని చెప్పారు. నిబంధనలు మీరితే చట్టపరమైన చర్యలు ఉంటాయని షాపు నిర్వాహకులకు సూచించారు. బెల్టు షాపులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికే మూడు కేసులు నమోదు చేసి ఇద్దర్ని బైండోవర్ చేశామన్నారు. ఎన్‌డిపిఎల్ మద్యం, నాటు సారాయిపై వివరాలు తెలిస్తే స్థానిక ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

20వ తేదీలోపు అందరికీ ఎన్టీఆర్ సుజల స్రవంతి నీరు : ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణ ప్రజలతోపాటు శివారు ప్రాంతాలకూ ఈ నెల 20వ తేదీ లోపే ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా శుద్ధి చేసిన రక్షిత నీటిని సరఫరా చేస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని తాగునీటిచెరువు వద్ద ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్ పునరుద్ధరణ పనులను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. రాష్ట్రంలో కుప్పం తరువాత చిలకలూరిపేటలోనే ఈ పథకాన్ని పున:ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఇన్నేళ్ల నిరుపయోగంగా ఉండి మరమ్మతులకు కూడా పనికి రాని విధంగా చేరిందని చెప్పారు. గత ఎమ్మెల్యే విడదల రజిని పాపాలకు ఇది మరో నిదర్శనమన్నారు. ప్రజలు ఎలా పోయినా నాకేంటి అనేరీతిలో ఎన్నికలకు ఆర్నెళ్ల ముందే ఈ నియోజకవర్గాన్ని కూడా వదిలేసి పోయిన మనిషి మళ్లీ ఏ మొహం పెట్టుకుని ఇక్కడకు వస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో ప్లాంట్ ఆర్గనైజర్ రామకృష్ణ, జె.మదన్, బి.సత్యం పాల్గొన్నారు.

తాగునీటీ సరాఫరాలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

తాగునీటి విడుదలలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా ఏదైనా కారణం వల్ల నీటి సరఫరా నిలిపేయాల్సి వస్తే ముందుగానే సమాచారం ఇవ్వడంతోపాటు మళ్లీ ఎప్పుడు సరఫరా చేసేది చెబుతుంటారు. అయితే శనివారం అందుకు భిన్నంగా జరిగింది. అందరూ నీటి కోసం నిరీక్షిస్తుండగా అవి రాలేదు. కొంతమంది ఎఇని సంప్రదించగా విషయం గోడల మీద అంటించాం చూసుకోండి అని సమాధానమిచ్చారు. రెండ్రోజులుగా నీటి సరఫరా సరిగా లేదు. ఆదివారం కొన్ని ప్రాతాలలో సరఫరా అవగా, కొన్ని వార్డుల్లో 10 నిముషాలే వచ్చాయి. కారణమేమిటి అని చెప్పే వారు లేరని స్థానికులు విమర్శిస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఈ-ఐ కేంద్రం మూత

- నిలిచిన కళ్లజోళ్ల పంపిణీ
- ఐదున్నరేళ్లలో 30 వేల మంది పేదలకు ఉచితంగా కళ్లజోళ్లు

ఈ-ఐ కేంద్రంలో కంటిపరీక్షలు (ఫైల్)

ప్రజాశక్తి- మాచర్ల

సర్వేంద్రియానాం నయనం ప్రధానం.. అటువంటి కళ్లకు ఎటువంటి చిన్న సమస్య వచ్చి చూపు తగ్గినా డబ్బుపెట్టుకునే స్థోమతున్నవారు ప్రైవేటు ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకుంటారు. పేదలైతే డబ్బులు పెట్టుకోలేక మసక కళ్లతోనే జీవనం కొనసాగిస్తూంటారు. పేదలకు కంటి వెలుగులు ఇవ్వాలనే తపంపుతో గత టిడిపి ప్రభుత్వం 2018 ఫిబ్రవరిలో ఈ-ఐ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం అపోలో ఆసుపత్రితో ఒప్పందం కుదుర్చుకుని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యశాలల్లో 'ఐ' కేంద్రాలను ఏర్పాటు చేసింది. వైసిపి ప్రభుత్వం కూడా 'ఐ' కేంద్రాల ఒప్పందాన్ని పొడిగించి కొనసాగించింది. మాచర్ల ఆసుపత్రిలో కూడా ఇద్దరు సిబ్బందిని, యంత్ర సామగ్రిని అందుబాటులో ఉంచారు. దాంతో మాచర్ల పరిసర గ్రామాల పేదలు మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలోని 'ఐ' కేంద్రంలో కంటి పరీక్షలు చేయించుకుని, ఉచితంగా కళ్లజోళ్లు తీసుకునేవారు. అలా కళ్లజోడులు తీసుకున్న వారు తిరిగి ఏడాది తరువాత పరీక్షలు చేయించుకొని కంటి చూపులో వచ్చిన మార్పులకు అనుగుణంగా మరలా కళ్లజోళ్లు తీసుకొనేవారు. ఇవి నిరుపేదలకు ఎంతోగానో ఉపయోగపడ్డాయి.

మాచర్లలో రోజుకు 40 మంది నుంచి 50 మంది వరకు ఉచితంగా నేత్ర పరీక్షలు చేయించుకునేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఒప్పందాన్ని కొనసాగించకపోవటంతో ఇప్పటి వరకు వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా కళ్లజోళ్లు ఇచ్చిన ఐ కేంద్రం అక్టోబర్ 17 నుంచి మూతపడింది. దాంతో పేద రోగులు ఆసుపత్రికి వచ్చి, కళ్లజోడులు ఇవ్వటం లేదని తెలుసుకొని నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో కంటివైద్యుడు కంటిపరీక్షలు చేస్తున్నా కళ్ళజోడు ఇవ్వటం లేదని రోగులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఎవరూ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించినా రోగులు బారులుదీరి కనపడతారు. పోషకాహార లోపం, అధిక వేడిలో నాపరాయి క్వారీ, మట్టి, పొలం పనులు చేసే వారు ఎక్కువగా ఉండటంతో మాచర్ల పరిసర ప్రాంతాల్లోని జనులకు కంటి సమస్యలు అధికంగా ఉంటాయి. 'ఐ' కేంద్రం మూత పడటంతో ప్రస్తుతం పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు ఖర్చవుతోందని నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే 'ఐ' కేంద్రాలను తిరిగి ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

50 వేల మందికి కంటి పరీక్షలు

అనీల్‌బాబు, ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్.

మాచర్ల ఈ-ఐ కేంద్రం ద్వారా పరీక్షలు చేసి రోగ నిర్ధారణ పూర్తయ్యాక అవసరమైన వారికి కళ్లజోళ్లను ఉచితంగానే ఇచ్చే వాళ్లం. ఐదున్నారేళ్లలో సుమారు 50 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 25 వేల నుంచి 30 వేల వరకు ఉచితంగా కళ్లజోళ్లు అందించాం. రాష్ట్ర ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందం ముగిసిపోయిందని, ఐ కేంద్రం పని చేయాలంటే మళ్లీ ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నాతో పాటు పారామెడికల్ అప్తాల్మిక్ అసిస్టెంట్ విధులు నిర్వహించాం. తిరిగి ఐ కేంద్రం ప్రారంభిస్తే తమకే ప్రాధాన్యమిచ్చి ఉద్యోగంలోకి తీసుకుంటారని భావిస్తున్నాం. ప్రస్తుతం ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నాం. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం.

చెస్‌తో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుదల

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

చెస్ ఆడటం వలన జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, చెంచిరెడ్డి, మాస్టర్ కిరణ్ అధ్వర్యంలో పట్టణంలోని కోదండ రామాలయంలో ఆదివారం చదరంగం పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, టిడిపి నాయకులు ఎనుముల కేశవరెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మీ చెన్నకేశవ దేవాలయం మాజీ ఛైర్మన్ రంగ చెన్నయ్య హాజరయ్యారు. చెస్ అడటం వలన దూరదృష్టి, ఆలోచనా సామర్థ్యం, సమయస్ఫూర్తి మెరుగుపడతాయని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తిరివీధి వెంకట నాగేశ్వరరావు, కార్యదర్శి పందిరి నరసింహారావు, కోశాధికారి చుండూరు సత్యనారాయణ, యూనివర్సల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆవుల అంజి, సంయుక్త కార్యదర్శి బచ్చు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మంజులారెడ్డికి సత్కారం

ప్రజాశక్తి - రెంటచింతల : టిడిపిలో కష్టపడిన వారికి అందలమెక్కిస్తారనే దానికి తానే ఉదాహరణని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి ఛైర్మన్‌గా నియమితులైన చెరెడ్డి మంజులారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రెంటచింతలలోని టిడిపి కార్యాలయంలో ఆమెను కూటమి నేతలు ఆదివారం సత్కరించారు. 1955లో మాచర్ల నియోజకవర్గం ఏర్పాటు అయిన నాటి నుంచి మండలానికి తొలిసారి కార్పొరేషన్ పదవి అందుకోవడం, అందులో ఓ మహిళకు కేటాయించడం హర్షణీయమని పలువురు పేర్కొన్నారు. టిడిపి మండల అధ్యక్షులు సిహెచ్.అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, రాజారెడ్డి, రామకృష్ణ, ఎన్.బాబు, ఎల్.పున్నారావు, సిద్ధయ్య పాల్గొన్నారు.

104ను ప్రభుత్వమే నిర్వహించాలి

ఉద్యోగ భద్రత కల్పించే వరకు ఉద్యమం

ధర్నా చౌక్ వద్ద 104 ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

104 ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ 104 ఎంఎంయు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.ఆంజనేయులు నాయక్ డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట గాంధీ పార్క్ ధర్నా చౌక్ వద్ద ఆదివారం 104 ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ 2008లో 104 వ్యవస్థ ప్రారంభమైందని, ప్రారంభ దశలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ప్రభుత్వమే నడిపిందని అన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 104 వ్యవస్థను అరబిందో ప్రైవేటు సంస్థకు అప్పగించడం వల్ల ఉద్యోగ భద్రత కరువైందని, సకాలంలో వేతనాల్లేక ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కీలకమైన వైద్య రంగంలో పనిచేస్తున్న ప్రతి విభాగంలో ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. 2008లో చేరిన ఉద్యోగులకు 2019లో చేరిన ఉద్యోగులకు జీతాల్లో వ్యత్యాసం ఎక్కువగా ఉందన్నారు. పాత ఉద్యోగులకు రూ.26 వేలు ఇస్తుంటే కొత్త వారికి రూ.16 వేలే ఇస్తున్నారని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు పిఎఫ్, ఒఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి డి.కోటిరెడ్డి మాట్లాడుతూ 104 ఉద్యోగులకు సంబంధించి పిఎఫ్ రెండు భాగాల మొత్తాన్ని ఉద్యోగుల వేతనాల నుండి తీసుకోవడం దుర్మార్గమన్నారు. పిఎఫ్ ఒకభాగం ఉద్యోగులు చెల్లిస్తే, మరోభాగం ప్రభుత్వం చెల్లించాలన్నారు. 104 వాహనాలకు ఫిట్మెంట్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని, 104 ఉద్యోగులకు 3 నెలలకు ఒకసారి కాకుండా ప్రతినెలా వేతనాలు చెల్లించాలని కోరారు. 104 వ్యవస్థను అరబిందో నుండి మినహాయించి ప్రభుత్వ రంగంలోకి తీసుకొని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నిరసనకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ సుభాని, కార్యదర్శి అరుణ, ఉద్యోగులు పాల్, సాంబశివరావు, బాషా, ఏసుదానం పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న 104 మొబైల్ మెడికల్ యూనిట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కలెక్టర్ కార్యాలయం వద్ద 104 ఎం.ఎం.యూ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.సత్యరాజ్, వి.విజయ్ కుమార్ మాట్లాడుతూ 104 వైద్యసేవలు నిర్వహించే అరబిందో కంపెనీ ఉద్యోగులకు నెలనెలా జీతాలు ఇవ్వట్లేదని, మూడు సంవత్సరాల నుండి ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లు కూడా ఇవ్వలేదన్నారు. గతంలో మాదిరిగా ప్రభుత్వమే 104 నిర్వహిస్తే ప్రభుత్వానికి భారం తగ్గుతుందని, ఉద్యోగులకు భద్రత, మెరుగైన సౌకర్యాలు అందుతాయన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీవో నెంబర్ ఏడు ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. యాజమాన్యం ఈపిఎఫ్, ఈఎస్ఐకు సంబంధించి ఉద్యోగుల వాటా, యాజమాన్యం వాటా రెండు కూడా ఉద్యోగుల దగ్గర ఉండే కట్టిస్తున్నారని, ఇది అన్యాయమన్నారు. తక్షణం ఉద్యోగులకు రావాల్సినటువంటి బకాయిలను చెల్లించాలన్నారు. వాహనాల ఫిట్నెస్ ఇన్సూరెన్స్ వెంటనే చెల్లించాలని, తక్షణమే ప్రభుత్వం యాజమాన్యం సమస్యల పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని, లేని ఎడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాకు మధ్యతరగతి ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ వివికె సురేష్, 108 ఉద్యోగుల యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ యం.హసన్ కమల్, 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సాయిరాం, ఏడుకొండలు, శ్రీహర్ష, బాలకష్ణ, వినయ్‌బాబు, సత్యనారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు భారంగా మారిన అధిక ధరలను అరికట్టండి

ఉండవల్లిలో ప్రజాపోరును ప్రారంభించిన పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

రోజు రోజుకి పెరుగుతున్న అధిక ధరలను అరికట్టడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారని, ప్రజలకు భారంగా మారిన అధిక ధరలను అరికట్టాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం ఉండవల్లిలో ప్రజాపోరు ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతు ప్రభుత్వ భూముల్లో ఇళ్ల వేసుకుని నివసిస్తున్న వారికి ఇళ్ల కట్టించి పట్టాలివ్వాలని, విద్యుత్ ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించాలని తదితర డిమాండ్స్ నెరవేర్చుకునేందుకు 14న తహశీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపిచ్చారు. మహిళలు, బాలికలపై నిత్యం అత్యాచారాలు దాడులు జరుగుతున్నాయని వీటిని నిలువరించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రాష్ట్రాల హక్కులు కాలరాసేందుకు, రాజ్యాంగానికి తూట్లు పొడిచేందుకు కేంద్రంలోని బిజెపితీసుకు వస్తున్న జెమి లి ఎన్నికలను ప్రజలు అందరూ వ్యతిరేకించాలని కోరారు. మద్యాన్ని ప్రభుత్వం ఆదాయ వనరుగా చూస్తుందని మద్యం మీద ఉన్న శ్రద్ధ ప్రజలకు మంచినీళ్లు అందించడంలో చూపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందని అన్నారు. ప్రభుత్వం చెప్పేదానికి చేసేదానికి పొంతన కుదరడం లేదని అన్నారు. ప్రభుత్వం చేసిన వాగ్దానాలను నిలుపుకోకుండా ప్రజలపై భారాలు వేస్తూ ఇబ్బందులకు గురి చేయటం ఏమాత్రం సరైనది కాదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అధిక ధరలను అరికట్టాలని, విద్యుత్ ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని, మహిళలు, బాలికలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని, ఇసుక సరఫరాను సక్రమంగా అందించాలని కోరారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ రాజధానిలో ప్రారంభించబోయే అభివృద్ధి పనులలో స్థానికులకే ప్రాధాన్యత నివ్వాలని కోరారు. ఉండవల్లి, పెనుమాకలలో యు వన్ జోన్ ఎత్తివేయాలని, సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణంలో ఉన్న భూముల రైతులతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపి న్యాయమైన ప్యాకేజీని ఇవ్వాలని అన్నారు. ప్రచార జాత ఉండవల్లి పెనుమాకలలో పర్యటించింది. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం భాస్కరయ్య, ప్రజాశక్తి బాధ్యులు ఓ శాంతి, ఓలేటి శ్రీనివాస్, రమేష్ సిపిఎం నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఎం భాగ్యరాజు, టి బక్కి రెడ్డి మూడవ శాఖ కార్యదర్శి సంకురు ఇమాన్యుల్ రాజు రాజధాని నాయకులు కే జగదీశ్వర్ రెడ్డి వి పార్థసారథి ఆర్ వి రాఘవయ్య టిశివయ్య కంచర్ల శేషయ్య చెంచయ్య మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని చిన్నకాకాని గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జెమిలి ఎన్నికల విధానం తీసుకొస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాసేందుకు సిద్ధపడుతున్నారని ఇది సరైనది కాదని తెలిపారు. ఒకేసారి ఎన్నికలు పెట్టడం ద్వారా ఖర్చు ఎలా తగ్గుతుందో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో విద్యుత్ ఛార్జీలు పెంచనని చెప్పిందని, దానికి భిన్నంగా గత నెలలో 6000 కోట్ల రూపాయలు అలాగే రాబోయే నెలకి 11,000 కోట్లు రూపాయలు పెంచడానికి సిద్ధం చేసి ఉంచారని తెలిపారు. ఇప్పటికైనా టిడిపి కూటమి తన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. అలాగే గత ప్రభుత్వం చేసిన తప్పిదాలని టిడిపి కూటమి కూడా అమలు చేస్తుందని ఈ సరైంది కాదని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ చిన్నకాకాని గ్రామ కార్యదర్శి జి. బాబు వరప్రసాద్, నాయకులు కాజ శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

చినకాకానిలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

ప్రజాశక్తి - తాడికొండ

రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాపోరు ప్రచారోద్యమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కంచుమాటి అజయ్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఈ మేరకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల విపరీతంగా పెంచడం వలన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. ఇసుక అధిక రేట్లకు ప్రస్తుత పరిస్థితిలో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉందని దీని వలన ఇసుక కొనుగోలు తగ్గి భవనిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో 60 శాతం పాడి పరిశ్రమ వ్యవసాయం రంగాలపై ఆధారపడి జీవనం కొనసాగించే వారేనని పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు పేదరికం ఉన్నవారు మరింతగా పేదరికలం లోకి కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, సుభాని, ముక్కర శ్రీహరి, శ్రీరాములు,రామకష్ణ,.దావీదు రైతులు కార్మికులు పాల్గొన్నారు.

తాడికొండలో ప్రజాపోరు ప్రచారంలో కరపత్రం ఆవిష్కరిస్తున్న కంచుమాటి అజయ్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

దుగ్గిరాల మండలంలో ప్రజాపోరు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచికలపూడి పోతురాజు చెట్టు వద్ద ప్రజా పోరు గోడ పత్రికలను ఆవిష్కరించి కరపత్రాలు పంచి ప్రచారం చేశారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ మంచికలపూడి రైల్వే గేట్ నుంచి కొండూరు వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని వెంటనే బాగు చేసి కొత్త రోడ్డు వేయాలనికోరారు. వ్యవసాయ అభివృద్ధికి కీలకమైన పంట కాలువలు రిపేర్లు గుర్రపు డెక్క తోటి కాడ వ్యవసాయ సీజన్ రాకముందే నివారించేందుకు తగిన యంత్రాంగాన్ని నిధులను కేటాయించాలని కోరారు. ఇసుకను ఫ్రీగా అందజేయాలని 15న మండల కేంద్రాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలనికోరారు. కార్యక్రమంలో వై స్టాలిన్ వైబ్రేమేశ్వరరావు వి శేషగిరిరావు సురేషు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో

డొంకరోడ్డులో ప్రచారం చేస్తున్న నాయకులు

నేడు కలెక్టరేట్ వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

నిత్యావసర ధరల పెరుగుదల, నిరుద్యోగం, ప్రజలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భారాలకు వ్యతిరేకంగా సిపియం ప్రజాపోరు క్యాంపెయిన్‌లో భాగంగా గుంటూరు జూట్‌మిల్ కాలనీలో సిపియం నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ, నాయకులు యం.కిరణ్, శ్రీనివాస్, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సమస్యల పరిష్కారానికి నేడు కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. అలాగే బొంగరాల బీడు, నిరుపేదల కాలనీలో స్థానిక శాఖ కార్యదర్శి జి.శంకర్‌తో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపియం నగర నాయకులు ఎ.కళ్యాణి, ఆకవరపు యశ్వంత్, కె.శ్రీనివాసరావు, జి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు మేలు చేసేది చంద్రబాబే : శ్రీదేవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి హయంలో దళితులకు ఎటువంటి మేలు జరగలేదని ఉన్న పథకాలన్నీ రద్దు చేశారని మాదిగ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవీ ఆరోపించారు. గుంటూరులోని తన నివాసంలో ఆమె ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ గా తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, దగ్గుబాటి పురంధేశ్వరికి దన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో జగన్ దళితులకు మేనమామ అంటూ చెప్పుకుని, దళితులకు అణగదొక్కారని తెలిపారు. దళితులపై దాడి చేసే వారికి మాత్రమే ఆయన మేలు చేశారని అన్నారు. మాదిగ కార్పొరేషన్ ద్వారా గతంలో ఎవరికయినా మేలు జరిగిందా అని ఆమె ప్రశ్నించారు. తమ కార్పొరేషన్ నిధులతో మాదిగలకు కావాల్సినవి మౌళిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. జగన్ ప్రభుత్వంలో దళితులకు ఇచ్చే పథకాలు నిలిపివేశారన్నారు. మూడు రాజధానులు అంటూ అమరావతిని అభివృద్ధి చేయలేదన్నారు. అభివృద్ధి చెందితే దళుతులకు ఉద్యోగాలు వచ్చేవన్నారు. దళితులను చంపిన వైసిపి నాయ కులు నందిగం సురేష్, అనంతబాబును జగన్ ఆదరించారని తెలిపారు. దళిత డాక్టర్ సుధాకర్ మాస్క్ అడిగితే వేధించి చంపారని గుర్తు చేశారు. లిడ్ క్యాప్, ఎస్సి కార్పొరేషన్లకు జగన్ హయంలో నిధులు ఇవ్వలేదన్నారు. గత 5 సంవత్సరాల కాలంలో దళితులకు ఒరిగింది ఏమీలేదన్నారు. జగన్ అమలు చేసింది నవరత్నాలు కాదు, నవ మోసాలుగా అభివర్ణించారు. వైసిపి హయంలో ప్రత్యర్థులపై దాడులు చేసిన వారికి, బూతులు తిట్టిన వారికే పదవులు ఇచ్చారన్నారు.

బాల వజ్రబాబుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - తుళ్లూరు

తాడికొండ నియోజక వర్గ సమన్వయకర్తగా నియమితులైన వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు)ను మండల వైసిపి నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొప్పుల శేషగిరిరావు,గంజిమాల కోటేశ్వరరావు, ఆరేపల్లి జోజి,కొప్పుల అంద్రెప్ప, తంబి, సరిగల శ్రీను బాల వజ్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వైసిపికి పూర్వవైభవం తీసుకొచ్చే కృషిలో తామంతా భాగస్వాములవుతామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ద్విచక్ర వాహనం ఢీకొని అంగన్వాడీ టీచర్ భర్త మృతి చెందిన ఘటన మండలంలోని రెంటపాళ్లలో శనివారం రాత్రి జరిగింది. రెంటపాళ్లకు చెందిన తలారి రత్నశేఖర్ (54) రోడ్డు దాటుతున్న క్రమంలో సత్తెనపల్లి నుండి అచ్చంపేట వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తలకు బలమైన దెబ్బ తగలటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతునికి భార్య మంజుల గ్రామంలోని ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తుండగా వీరికి ముగ్గురు కుమారులున్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

500 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

అత్యంత వెనుకపడ్డ పల్నాడు ప్రాంతంలో ఉచిత వైద్యశిబిరాలు అమూల్యమైనవని మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. పెదకాకాని శంకర కంటి వైద్య ఆసుపత్రి, ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో పట్టణంలోని జెండాజెట్టు సెంటర్ వద్ద గల షాదీఖానాలో ఆదివారం కంటి, ఇఎస్‌టి ఉచిత వైద్యశిబిరాన్ని ఛైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 500 మందిని పరీక్షించగా వీరిలో 38 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి పెదకాకాని శంకర వైద్యశాలకు తీసుకువెళ్లారు. డాక్టర్ షేక్ వశీంమీరా గొంతు, ముక్కు, చెవి పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో ఎనుముల కేశవరెడ్డి, జానీబాషా, గౌస్‌మోహిద్దీన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి- వెల్దుర్తి : ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. ఆదివారం ఎస్‌కెబిఆర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, టిడిపి సీనియర్ నాయకులు ఎనుముల కేశవరెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడటంలో, వాతావరణాన్ని సమతుల్యతగా ఉంచడానికి చెట్లు ప్రధాన భూమికను పోషిస్తాయన్నారు. మొక్కలు నాటడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో జి.కోటిరెడ్డి, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కె.నాగేశ్వరరావు, బి.చెంచిరెడ్డి, కె.ప్రవీణ్, పి.లక్ష్మారెడ్డి, పి.శ్రీనివాసరాజు, ఎ.కోటిరెడ్డి, బి.మల్లికార్జునరావు, బి.వీరనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కల్వర్టు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదివారం పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలో పారిశుధ్య పనులు పరిశీలించారు. కల్వర్టు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టిడిపి నాయకులు జి.అంకమ్మ చౌదరి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి, నార్నెపాడులో కరపత్రాల పంపిణీ

ప్రజల్ని ఇబ్బందుల పాల్జేస్తున్న ధరలు

- సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు ప్రచార యాత్ర
- 14న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పేద, మధ్యతరగతి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన ప్రజాపోరు ప్రచార యాత్రలో భాగంగా ఆదివారం స్థానిక పాత బస్టాండ్ ఏరియా, 28వ వార్డు జెండా చెట్టు, నాగన్న కుంట సెంటర్లలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ ఉపాధి అవకాశాల్లేక, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి కుటుంబాల గడవటం కష్టంగా ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచి ప్రజలపై మోయలేని భారాలను మోపిందని మండిపడ్డారు. వీటికి వ్యతిరేకంగా సిపిఎం పోరాడుతోందన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజాపోరు ప్రచారం అనంతరం 14న తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలో పట్టణ ప్రజానీకమంతా భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, సిపిఎం నాయకులు పి.సూర్యప్రకాశరావు, జె.రాజ్‌కుమార్, ఎం.జ్యోతి, టి.లక్ష్మి, ఐ.అరుణ, సిహెచ్.ఆంజనేయులు, ఐ.లింగయ్య, పి.షరీఫ్, షేక్ సైదులు, వి.రామారావు, డి.పుల్లారావు, ఎ.ప్రసాద్‌రావు, పి.రామారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

కేంద్ర బిజెపి ప్రభుత్వము నిత్యావసర వస్తువుల ధరలను అదుపు యుమడంతోపాటు చౌక దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులను అందజేయాలని సిపిఎం మండల కార్యదర్శి జి.బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని నార్నెపాడులో ప్రజాపోరు ప్రచార యాత్ర చేశారు. జమిలి ఎన్నికలంటూ రాష్ట్రాల హక్కులను హరించడానికి కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. సమస్యల పరిష్కారం కోసం 14న ముప్పాళ్లలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టి.మస్తాన్‌రావు, ఎం.నాగేశ్వరావు, డి.అప్పారావు, కె.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన ప్రజాపోరు ప్రచారం యాత్ర మండల కేంద్రమైన యడ్లపాడులో ఆదివారం జరిగింది. నాయకులు కె.రోశయ్య మాట్లాడారు. 14వ తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మండల కన్వీనర్ జె.శంకరరావు, బి.పీటర్, ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని 17వ వార్డులో అంకమ్మ చెట్టు వద్ద నుండి చీరాల రోడ్లో ప్రజాపోరు ప్రచార యాత్ర చేపట్టారు. వెంకట రెడ్డి నగర్, రాచముల నగరం, నేషనల్ కంపెనీ మీదగా పసుమర్రు బ్రిడ్జి ఇంటింటికీ సిపిఎం శ్రేణులు వెళ్లి కరపత్రాలు పంపిణీని చేశారు. సిపిఎం పట్టణ కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాచుమల్ల నగరు రోడ్డు సైడ్ కాల్వలు బాగు చేసి స్తంభాలు వేయాలన్నారు. కొత్త వారికి పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఇళ్లస్థలాలున్న వారికి ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5 ఇవ్వాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 14న ఉదయం 10 గంటలకు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాకు జనం తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.లూథర్, ఎస్.బాబు, పి.గణేష్ పాల్గొన్నారు.

చిలకలూరిపేట పట్టణం, యడ్లపాడులో ప్రజాపోరు ప్రచార యాత్రలో సిపిఎం శ్రేణులు

మహనీయుల్లో కులమో, మతమో చూడొద్దు..

కోటప్పకొండలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణలో ఎంపీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గొప్ప కీర్తిని సాధించిన రాజు శ్రీకృష్ణదేవరాయలు అంటే యుద్ధ వీరుడు పరిపాలన దక్షుడే కాదని, సకల కళా వల్లభుడని, ప్రతితరానికీ ఆయన స్ఫూర్తిదాయకమని ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. నరసరావుపేట మండలంలోని కోటప్పకొండ వద్ద శ్రీకృష్ణదేవరాయ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాపు అన్నదాన సత్రం ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుతో కలిసి ఎంపీ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధిలో శ్రీకృష్ణదేవరాయలు చూపిన కళ ప్రపంచ స్థాయిలో నిలిచిపోయిందన్నారు. తిరుపతి, శ్రీకాళహస్తి అభివృద్ధి చెందింది శ్రీకృష్ణదేవరాయలు కాలంలోనే అని చెప్పారు. హంపిని ఢీకొట్టే కళ ప్రపంచంలోనే లేదనేది ఒక నానుడని అన్నారు. కవి హృదయం కూడా శ్రీకృష్ణదేవరాయలకు ఉందని తెలిపారు. అంతటి మహోన్నత వ్యక్తి పేరును తనకు పెట్టడానికి గల కారణం అతనిలోని కళలు సిద్ధించాలని తన తండ్రి భావించారని తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చేయడంలో కూడా శ్రీకృష్ణదేవరాయలకు ప్రత్యేక ముద్ర ఉందని, చెరువులు కాల్వలు తీయడంలో ఆయన చూపిన పనితనం ఎప్పటికీ

చెరగని ముద్ర వేసిందని అన్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేందుకు ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. మహనీయులు, నాయకులు నుండి చూడాల్సింది.. కులమో, మతమో కాదని, వారు సాధించిన ఘన కీర్తి, పనితీరని అన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేను ట్రస్ట్ సభ్యులు సన్మానించారు. రాయల శ్రీనివాసరావు, మేళం శ్రీకష్ణ, అల్లంశెట్టి మోహనరావు పాల్గొన్నారు.

రహదారిపై ఏర్పడిన గుంత

ప్రమాదలు తెచ్చిపెడుతున్న గుంత

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలోని బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట రహదారిపై గుండ ప్రమాదకరంగా మారింది. ఇటుగా వచ్చిన పలువురు వాహనదార్లు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు సత్వరం స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

ధన్వంతరికి ఘన నివాళి

ప్రజాశక్తి - అమరావతి

ఆయుర్వేద వైద్య పితామహుడు ధన్వంతరి స్వామి జయంతుత్సవాలను స్థానిక పంచాయతీ సెంటర్లో నాయిూబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బి.వెంకటేశ్వరావు, ఎన్.శివనాగమల్లేశ్వరరావు, ఎ.లక్ష్మీనారాయణ, సిహెచ్.శివప్రసాద్, రాము, బి.చాముండి పాల్గొన్నారు.

చేనేతలను అన్ని విధాలా ఆదుకుంటాం

కొలనుకొండలో పద్మశాలి భవన్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కూటమిప్రభుత్వంలో చేనేతలను అన్ని విధాల ఆదుకుంటామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొలనుకొండ జాతీయ రహదారి సమీపంలో ఆదివారం పద్మశాలీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఐడబ్ల్యుఎ) ఆధ్వర్యంలో చేపడుతున్న నూతన పద్మశాలీ భవన్‌కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. పద్మశాలీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర కమిటీ అధ్యక్షులు స్వర్గం పుల్లారావు దంపతులు పూజా కార్యక్రమం నిర్వహించారు. శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నారా లోకేష్ కు పీఐడబ్ల్యూఏ సభ్యులు, కూటమి నేతలు, కార్యకర్తలు మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. 17 ఏళ్ల క్రితం విజయవాడలో ప్రారంభమైన పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమల ద్వారా చేనేత కుటుంబాలకు అండగా నిలుస్తోందనీ అన్నారు. అంతేకాకుండా పేద విద్యార్థులు, చేనేత కుటుంబాలకు దాదాపు మూడు కోట్లకు పైగా సహాయ సహకారాలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ మంగళగిరిలో అంతర్జాతీయ ప్రమాణాలతో వీవర్స్ శాల ఏర్పాటుచేసి చేనేత కుటుంబాలకు అండగా నిలిచామన్నారు. చేనేత మహిళలకు పెద్దఎత్తున ఆధునిక రాట్నాలను పంపిణీ చేశామని ఆయన తెలిపారు. పీఐడబ్ల్యూఏ చేపడుతున్న కార్యక్రమాలు, నూతన పద్మశాలీ భవన్ నిర్మాణానికి సంబంధించిన వివరాలను ఈ సందర్భంగా లోకేష్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్, డెవలప్మెంట్ చైర్మన్ నందం

పద్మశాలి భవన్‌కు భూమి పూజ చేస్తున్న మంత్రి నారా లోకేష్ తదితరులు

అబద్దయ్య, టిటిడి బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకి దేవి, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, పంచుమర్తి అనురాధ,టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తదితరులు టిడిపి నాయకులు తదితరులుపాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణను వెంటనే ప్రారంభించాలి

మంగళగిరిలో ప్లకార్డులతో నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షులు బి ఎస్ ఆర్ శర్మ, ప్రధాన కార్యదర్శి బి జె గాంధీ డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరి శివాలయంలో కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతు గత ప్రభుత్వం కాంట్రాక్టర్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని జీవో నెంబర్ 114 ను తీసుకురావడం జరిగిందని అన్నారు. ఈ జీవో ఉత్తర్వులు విడుదల చేసిన వెంటనే చట్ట ప్రకారం ఒక్క విద్యా శాఖలో తప్ప అన్ని శాఖలలో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల లను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వ అధికారులను అనేకసార్లు కలిసి విన్నవించిన క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభించలేదని అన్నారు. విధి లేని పరిస్థితిలో వినూత్న రీతిలో దశల వారి కార్యక్రమానికి అసోసియేషన్ పిలుపు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆ పిలుపులో భాగంగా గత నెల 14వ తేదీ నుండి 19వ తేదీ వరకు పసుపు రిబ్బన్లతో విధులకు హాజరయ్యామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని, మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించడం కూడా జరిగిందని వారు తెలిపారు.

కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి శివాలయంలో ప్లకార్డులతో నిరసన

అయినప్పటికీ ఇంతవరకు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగువేల మంది లెక్చరర్లు కాంట్రాక్టు బేసిక్‌లో పనిచేస్తున్నారని అన్నారు. చాలీచాలని వేతనాలతో జీవితం కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి జీవో నెంబర్ 114 ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిగ్రీ కళాశాల ప్రధాన కార్యదర్శి డి రాజు, గుంటూరు జిల్లా అధ్యక్షులు వై రమేష్ బాబు, కార్యదర్శి ఎం బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంకు హాజరైన డాక్టర్లు, నిర్వాహకులు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

102 మందికి ఆపరేషన్లకు ఏర్పాటు

ప్రజాశక్తి - పెదనందిపాడు : యార్లగడ్డ జయప్రద, రామయ్య చారిటీస్ మరియు శంకర కంటి ఆసుపత్రి, జిల్లా ఆంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఆదివారం కొండ పాటూరు జడ్‌పి అప్పర్ ప్రైమరీ స్కూలులో 25 వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 220 మంది కంటి పరీక్షల నిమిత్తం హాజరయ్యారు. అందులో 102 మంది కంటి శుక్లం ఆపరేషన్ కోసం ఎంపిక అయ్యారు. వీరికి పెద కాకాని శంకర్ కంటి ఆసుపత్రిలో ఉచి తంగా ఆపరేషన్లు చేస్తారని, వీరి రాకపోకలకు వారే ఏర్పాట్లు చేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు యార్లగడ్డ అంకమ్మ చౌదరి, యార్లగడ్డ వీర శేఖర్, యార్లగడ్డ సురేంద్ర బాబు, శంకర ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రమణ, డాక్టర్ చైతన్య, మేనేజర్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు జి రాఘవరావు, నల్లమోతు రాజేంద్ర, సిహెచ్ శ్రీనివాస్, అంకినీడు, కాటూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కొండ హరి కృష్ణారెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కొల్లిపర

కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-82 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు గత సంవత్సరం ఆత్మీయ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఆపన్న హస్తం పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించి పేద ఒంటరి వృద్ధులకు ఉచిత భోజనం ఇంటి వద్దకే అందజేయాలని నిర్ణయాన్ని గత సంవత్సర కాలంగా అమలు చేసి గ్రామస్తుల మన్ననలను పొందారు. ఆపన్న హస్తం ప్రథమ వార్షికోత్సవంతో పాటు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు కార్యక్రమంలో చీడేపూడి సురేష్ రెడ్డి గాది చంద్రశేఖర్ రెడ్డి ఉయ్యూరు శ్రీనివాస్ రెడ్డి కొండ హరికష్ణ రెడ్డి భీమవరపు శ్రీనివాసరెడ్డి కొల్లి రాఘవరెడ్డి అవుతు సాంబి రెడ్డి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డి వేమారెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటాం : వైసిపి

ప్రజాశక్తి - మంగళగిరి : వైసిపి కార్యకర్తలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమం తరావు, మంగళగిరి నియోజకవర్గం వైసిపి ఇన్చార్జ్ డి వేమారెడ్డి అన్నారు. ఆదివారం తాడేపల్లి మండల రూరల్ గ్రామాల విస్తృత సమావేశం మంగళగిరి లోని ఆ పార్టీ కార్యాలయంలో ఏ వెంకట నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేని స్థితిలో ఉన్నారన్నారు. మోసపూరితమైన వాగ్దానాలు చేసి ఎన్నికల్లో గెలిచారని విమర్శించారు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టులు అసభ్యంగా కాకుండా రాజకీయపరంగా పెట్టాలని కోరారు. సమావేశంలో ఆప్కో మాజీ చైర్మన్ చల్లపల్లి మోహన్ రావు, వైసిపి నాయకులు పి కృష్ణమూర్తి, యు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాడిన ఆశీర్వాదం

28వ వర్ధంతి సభలో నాయకులు - పలువురు నివాళి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

స్థానికంగా వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన పని చేసిన నాయకుడు చౌక్కా ఆశీర్వాదం అని సిపిఎం తాడేపల్లి మండలం కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఎంటిఎంసీ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో చౌక్కా ఆశీర్వాదం 28వ వర్ధంతి కార్యక్రమం సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి డోకిపర్తి రాజేంద్ర బాబు అధ్యక్షతన గ్రామంలోని సిపిఎం కార్యాలయం వద్ద జరిగింది. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ పూలమాల వేయగా, సిపిఎం స్తూపానికి గ్రామ సిపిఎం సీనియర్ నాయకులు డోకిపర్తి కోటయ్య పూల మాలవేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆశీర్వాదం పెద్దగా చదువు లేకపోయినా, మార్క్సిజం, లెనినిజం పట్ల ఆకర్షితుడయ్యారని, పార్టీ, గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన సిపిఎం మాజీ సర్పంచ్ కామ్రేడ్ డోకిపర్తి చలపతిరావు 1981 నుండి 1995 వరకు కామ్రేడ్ చలపతిరావుతో కలిసి, పార్టీ కోసం చేసిన కృషిలో ఆశీర్వాదం పాత్ర మరువలేనిదని ఆయన అన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ గా పనిచేశారని అన్నారు. గ్రామంలో పేదల, ఇసుక క్వారీ కార్మికుల పక్షాన నిలబడి, ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన వారి స్ఫూర్తిగా తీసుకొని ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, దాసరి సురేష్, సిపిఎం తాడేపల్లి పట్టణ నాయకులు వై .బర్నాబస్, డేవిడ్, దావీదు తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ సభలో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వెంకటరెడ్డి

దూరవిద్య ప్రవేశ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఈనెల 9న శనివారం నిర్వహించిన ఎంబీఏ, ఎంసిఎ ప్రవేశ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదల అయ్యాయి. ఈ మేరకు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ లు ఫలితాలను విడుదల చేశారు. ఈ ప్రవేశపరీక్షకు 201 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 188 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో 184 మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎంబీఏ , ఎంసిఏ ప్రవేశాలు నవంబర్ 15 తో ముగుస్తాయని తెలిపారు. ప్రవేశపరీక్షలో అర్హులైన వారి జాబితాను దూరవిద్య కేంద్రం వెబ్ సైట్ లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఏపీ ఐ సెట్ 2024 లో అర్హత సాధించిన విద్యార్థులు కూడా ఈ ప్రవేశాలకు నేరుగా అర్హులని తెలియజేసారు. ఈసందర్భంగా పరీక్షా కేంద్రాల సమన్వయకర్తలకు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కష్ణవేణి, సూపరింటెండెంట్ నేలపాటి నాగేశ్వరరావు, ప్రోగ్రామర్ మోహన్, అకాడమిక్ కౌన్సిలర్ లకు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, కో ఆర్డినేటర్ రామచంద్రన్ లు అభినందించారు.

డాక్టర్ కృష్ణారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

షుగర్ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

వాకర్స్ క్లబ్ తెనాలి 2 అధ్యక్షులు వేజళ్ల ఉమామహేశ్వర్ అధ్యక్షతన ఆదివారం ప్రముఖ డయాబెటిస్ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్వి కృష్ణారావు షుగర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యుల సందేహాలను నివృత్తి చేసారు. వ్యాధి గ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తన వైద్యంతో ఎంతోకాలంగా సేవలందిస్తున్న డాక్టర్ కృష్ణారెడ్డిని కమిటి సభ్యులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యవర్గ సభ్యులు జి మురహరి రావు, ఆర్ ఆనందరావు, భుజంగరావు, కోగంటి వీర రాఘవయ్య, కోగంటి అంజిబాబు, సత్యనారాయణ రాజు, గుమ్మడి నారాయణరావు, రావి సుబ్బారావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆదివారం పలు పోలింగ్ కేంద్రాలను మంగళగిరి నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఏ లక్ష్మీ కుమారి ఆదివారం పరిశీలించారు. ముసాయిదా ఫోటో ఓటర్ జాబితా 2025 సవరణ కార్యక్రమంలో భాగంగా స్పెషల్ క్యాంప్ జరుగుతుంది. ఏ ఈ ఆర్‌వో ల పరిధిలో ఉన్న పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

రాష్ట్రంలో కులగణనకు అన్ని పార్టీలూ మద్దతు తెలపాలి

ప్రజాశక్తి-గుంటూరు

బిసిల సమగ్ర అభివృద్ధికి జాతీయ స్థాయిలో జరపనున్న జనగణనతోపాటే రాష్ట్రంలోని 139 బిసి కులాల కుల గణనను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించేందుకు అన్ని పార్టీలు మద్దతు తెలపాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పక్క రాష్ట్రం తెలంగాణలో సమగ్ర కులగణనపై ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్ నియమించి, ప్రత్యేక నోడల్ ఏజెన్సీ ద్వారా సచివాలయంలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌తో కుల గణనకు సంబంధించి అన్ని సమస్యలను పరిష్కరించేలా ముందుకు వెళుతుంటే రాష్ట్రంలో పార్టీలు కుల గణనను పట్టించుకోవట్లేదన్నారు. అన్ని పార్టీలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. జనగణనతోపాటు ప్రజల కులాన్ని గణించేలా నూతన ఫార్మేట్‌తో ఒక కాలం పెట్టి, ప్రతి ఒక్క కుటుంబం యొక్క ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగం వంటి అన్ని వివరాలతో సమగ్ర సమాచారం చేరాలన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వాలు అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు, పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ కులగణనతో తోడ్పతుందని చెప్పారు. సమగ్ర కుల గణన ద్వారా ప్రజల సామాజిక జీవన స్థితిగతులు తెలుస్తాయని శంకరరావు అన్నారు.

విజయవాడ ఎంబివికెలో

నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు - ప్రజల కర్తవ్యంపై సభ

హాజరుకానున్న బి.వి.రాఘవులు

ప్రజాశక్తి - విజయవాడ

"దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు - ప్రజల కర్తవ్యం" అంశంపై ఈ నెల 11వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు 'ప్రజా చైతన్య సభ' జరుగుతుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ రాఘవయ్య పార్క్ సమీపంలోని ఎంబి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో జరిగే ఈ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి పాల్గొంటారని పేర్కొన్నారు.

మలినేనిలో ఐఈఈఈ విద్యార్థి విభాగం ఏర్పాటు

ప్రజాశక్తి-గుంటూరు

ఐఈఈఈ బ్రాంచ్ ఏర్పాటుకు హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజిలో ఐఈఈఈ స్టూడెంట్స్ బ్రాంచ్ ప్రారంభించారు. గుంటూరు అమరావతి సబ్సెక్షన్ పరిధిలో ప్రారంభించిన ఈ విద్యార్థి విభాగానికి కళాశాల ఈసీఈ హెచ్ఒడి డాక్టర్ విజయసారథి కౌన్సిలర్‌గా నియమితులు అయ్యారు. ఈ కార్యక్రమానికి గుంటూరు సబ్సెక్షన్ చైర్మన్ డాక్టర్ ఈదర శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా, డాక్టర్ కె.ఉషారాణి పాల్గొన్నారు. ఉషారాణి మాట్లాడుతూ ఐఈఈఈ విద్యార్థి విభాగం ద్వారా ప్రపంచస్థాయిలో ఉత్తమ ప్రమాణాలు ఉన్న వ్యక్తులతో పరిచయాలు, వాటిద్వారా ఉపయోగాలు, విద్యార్థి దశలో నాయకత్వపు లక్షణాలు పెంపొందిచుకోచ్చని అన్నారు. డాక్టర్ ఈదర శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలో సమయపాలన, క్రమశిక్షణ, డబ్బు సరైన మార్గంలో వినియోగించడం వంటి అనేక విషయాల గురించి విద్యార్థి విభాగ సభ్యులతో చర్చించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో గెలవాలి అంటే స్కిల్స్‌తో పాటు నాయకత్వపు లక్షణాలు పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా చిత్తంశెట్టి అలేఖ్యను విభాగ ప్రెసిడెంట్‌గా ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ జంపని కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విజేతలతో తులసి రామచంద్రప్రభు, తదితరులు

తులసి సీడ్స్ సౌజన్యంతో కర్రసాము పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం సౌత్ ఇండియా స్థాయిలో శిలంబం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను టీజేపీస్ కళాశాల కరస్పాండెంట్ బ్రహ్మం ప్రారంభించారు. ఈ పోటీలు ఆద్యంతం ఆసక్తికరంగా, రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీలలో గెలుపొందిన కర్రసాము వీరులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ముఖ్య అతిథి తులసి రామచంద్రప్రభు అందజేశారు. ఈ సందర్భంగా గత రెండు నెలలుగా శ్రమిస్తూ ఈ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతంగా పూర్తి చేసిన కర్రసాము కోచ్ వర్మను, గ్రాండ్ మాస్టర్ జిడుగు సుబ్బారావుని ప్రభు ప్రత్యేకంగా అభినందించారు. తనకు కూడా ఈ విద్య వచ్చునని, ఈ ప్రాచీన కళ అయిన కర్రసాము (సిలంబం) కనుమరుగు అవ్వకూడదనే ఉద్యేశ్యంతోనే ఈ కార్యక్రమ ఏర్పాటుకు సహకారం అందించామన్నారు. భవిష్యత్ లో కూడా సహకరిస్తామని వెల్లడించారు. కర్రసాము వంటి భారతీయ ప్రాచీన కళలను కాపాడుకోవడం మన కింకర్తవ్యం అన్నారు. ఈ టోర్నమెంట్‌లో ఆంధ్ర, తెలంగాణ, కేరళ, తమిళనాడు నుండి 300 మంది క్రీడా కారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉగ్గిరాల సీతారామయ్య, దళవాయి సుబ్రహ్మణ్యం, సిద్ధార్థ వర్మ, సుదీర్, సుమంత్, వర్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలకు పూర్తిగా అవసరమైన క్రీడా సామాగ్రి , మెడల్స్, మెమెంటోస్, టి.షర్ట్స్, భోజనం వసతి , అల్పాహార వసతులను తులసి సీడ్స్ వారు ఏర్పాటు చేశారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లా ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. జాతీయ విద్యాదినోత్సం సందర్భంగా నేడు విజయవాడలో జరిగే కార్యక్రమంలో వీరికి అవార్డులు ప్రదానం చేయనున్నారు. పొన్నూరు మండలం, మామిళ్లపల్లి మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గణితం ఉపాధ్యాయులు డాక్టర్ చెన్నంశెట్టిరమేష్, అలాగే కొల్లిపర మండలం, కొల్లిపర మండల ప్రాథమిక పాఠశాల ఎస్‌జిటి ఉపాధ్యాయులు పెనుమూడి మృత్యుంజయరావు రాష్ట్ర అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ బాలుర పోటీల్లో విజేత గుంటూరు

క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్యే కన్నా

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

కూటమి ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి ప్రగతి జూనియర్ కాలేజీ ఆధ్వర్యంలో జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 బాలబాలికల రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరైన విజేతలకు ట్రోఫీలు అందచేశారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో రెండు శాతం నుండి మూడు శాతానికి రిజర్వేషన్లు పెంచటం వల్ల క్రీడాభివృద్ధికి దోహదం చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. క్రీడాకారులకు పోలీస్ ఎక్సైజ్ శాఖలో ఉద్యోగాల భర్తీకి నిర్వ హించే పరీక్షల్లో రిజర్వేషన్లు ఇచ్చేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాను కూడ గతంలో క్రీడాకారుడిని అని వారి ఇబ్బందులు తనకు తెలుసని చెప్పారు. విజేతలకు శుభా

విజేతలకు ట్రోఫీ అందచేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

కాంక్షలు తెలియజేశారు. టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వై రామ స్వామి, ఎ.అమరేశ్వ రరావు, ఉమ్మడి గుం టూరు జిల్లా ఖోఖో అసోషియేషన్ కార్యదర్శి దాసరి కోటేశ్వరరావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరశింహారావు, సహాయ కార్యదర్శి సి.హెచ్ పద్మాకర్, ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, నిర్వా హకులు పి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ బాలుర విజేత గుంటూరు జిల్లా , బాలికల విజేత అనంతపురం. అండర్ 19 బాలుర విజేతగా గుంటూరు జిల్లా జట్టు నిలిచింది. విశాఖ పట్నం ద్వితీయ స్థానాన్ని కైవసం చేసు కుంది. తృతీయ కర్నూలు, నాల్గవ స్థానం విజయనగరం సాధించాయి. బాలికల విభా గంలో మొదటి స్థానాన్ని అనంతపురం రెండవ స్థానాన్ని వైఎస్ఆర్ కడప జిల్లా మూడవ స్థానాన్ని గుంటూరు జిల్లా నాల్గవ స్థానాన్ని విశాఖపట్నం జిల్లా కైవసం చేసుకున్నాయి.

అవినీతి రహితంగా పౌష్టికాహారం పంపిణీ

మహిళలకు బాలింతలకు అండగా శిశు సంక్షేమ శాఖ

పల్నాడు జిల్లా ఐసిడిఎస్ పి.డి కె.ఉమారాణి

అవినీతికి తావులేకుండా అంగన్వాడీ కేంద్రాల్లో పౌషకాహారం పంపిణీ చేస్తున్నామని పల్నాడు జిల్లా ఐసిడిఎస్ పీడీ కె.ఉమారాణి అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ప్రయోజన కార్యక్రమాలను, భవిష్యత్తులో చేపట్టబోయే పనులను ఆమె తెలియజేశారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ పలు అంశాలను తెలిపారు.

కె. ఉమారాణి, ఐసిడిఎస్ పీడీ

పల్నాడు జిల్లాలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏయే కార్యక్రమాలు చేపడుతున్నారు?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రజాప్రయోజన కార్యక్రమాలను ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం. పల్నాడు జిల్లాలోని తొమ్మిది ప్రాజెక్ట్‌ల ఐసిడిఎస్ పరిధిలో గల అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులకు, గర్భిణులకు, బాలి ంతలకు పౌష్టికాహారం అందిస్తున్నాం.

జిల్లాలో ఎన్ని అంగన్వాడీ సెంటర్లున్నాయి? ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు?

పల్నాడు జిల్లాలో 28 మండలాల్లో 2010 మెయిన్, 21 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. 1,13,207 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో గర్భిణులు 11,282, బాలింతలు 11608, 3 ఏళ్ల లోపు చిన్నారులు 63,326, ఆరేళ్లలోపు 26,991 మంది ఉన్నారు.

లబ్ధిదారులకు ఏయే పోషకాహారం ఇస్తున్నారు?

బాల సంజీవని కిట్ పేరిట రెండు కేజీల రాగిపిండి, 1 కేజీ అటుకులు, 250 గ్రా బెల్లం, ఎండు ఖర్జుర 250 గ్రా, చిక్కి 250 గ్రా, 1కేజీ కందిపప్పు, 3 కేజీల ఫోర్టిఫైడ్ బియ్యం, 500 గ్రా నూనె, 5 లీటర్ల పాలు, 25 గుడ్లు, బాలామృతం 2.5 కేజీలు పంపిణీ చేస్తున్నాం. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నాం. సోమవారం నుండి శనివారం వరకు ఉదయం 9 గంటలకు 4 గంటల వరకు అంగన్వాడి కేంద్రాలు ప్రారంభమవుతాయి. ప్రతి రోజూ పిల్లలకు వండిన అన్నం, కోడిగుడ్డు 100 మిల్లీ లీటర్ల పాలు అందిస్తాం. ఏడునెలల నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లలకు బాలావృతం 2.5, కోడిగుడ్లు 25 అందిస్తాం. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారులకు సక్రమంగా అందజేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

అంగన్వాడీ సెంటర్ల భవన నిర్మాణాలు ఏమైనా ప్రతిపాదనలు ఉన్నాయా?

పల్నాడు జిల్లాలో అంగన్వాడీ సొంత భవనాలు 564, అద్దె భవనాలు 1044 ఉన్నాయి. అయితే 423 భవనాలు ప్రభుత్వ, ప్రయివేటు భవనాలలో ఉచితంగా నడుస్తున్నాయి. నూతన భవనాల నిర్మాణంపై గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు ఉన్నాయి. దీనిపై మార్గదర్శకాలు మేరకు నూతన భవనాలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు పూర్తి చేస్తాం.

అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించడంలో లోపాలు ఉన్నాయంటున్నారు?

చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో సదరు కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శించిన సంఘటనలు జిల్లాలో అక్కడక్కడా చోటుచేసుకున్నాయి. అధికారులతో పర్యవేక్షణ చేపట్టి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్నాం. భవి ష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతాం.

ఐసిడిఎస్ ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తారు? పిల్లలకు ఏయే పాటలు, ఆటలు ఆడిస్తారు?

ప్రభుత్వ మార్గదర్శకాలు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిబంధనలు అనుసరించి నియామకాలు భర్తీ చేస్తాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక యాప్ రూపొందించారు. యాప్ ద్వారా పిల్లలకు కథలు, సంభాషణ, సృజనాత్మకత, అభినయ గేయాలు పలు రకాల ఆటపాటలు , విద్యాబుద్ధులు నేర్పిస్తాం.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చిన్నారుల్లో దాగిన సృజనను వెలికితీయాలి

బాల కళా ప్రభ సాంస్కృతికోత్సవం ప్రారంభలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

బాలనంద కేంద్రం ఆధ్వర్యంలో రుద్ర కళాక్షేత్రం సహకారంతో చిన్నారులలో దాగి ఉన్న సాంస్కృతిక లలిత కళలను ప్రోత్సహిస్తూ నిర్వహిస్తున్న 'బాల కళా ప్రభ' సాంస్కృతికోత్సవ పండుగ ఆదివారం స్థానిక కృష్ణ నగర్ లోటస్ ఆద్య పాఠశాలలో నిర్వహించారు. మూడు నుండి 10వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలు చిత్ర లేఖనం, తెలుగు పద్యం, సంస్కృతశ్లోకం, జానపద, శాస్త్రీయ సంగీతం, నృత్యాలు, తెలుగులోనే మాట్లాడుకుందాం, జానపద దేశభక్తి గీతాలు పాడేందుకు విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బాలానంద కేంద్రం అధ్యక్షులు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి ప్రారంభించి మాట్లాడుతూ దాదాపు ఏడు దశాబ్దాలుగా చిన్నారుల్లో దాగిఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికి తీసేందుకు, తద్వారా వారు చదువుతోపాటు జీవన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, ఆత్మనిర్భరం వంటి అనేక అంశాలలో ఎదిగేందుకు బాలానంద కేంద్రం కృషి చేస్తున్నదని వివరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్యదర్శి నడింపల్లి గురుదత్, సహాయ కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి జి.సంధ్యశ్రీ, అకాడమిక్ అడ్వైజర్ వై.ఉమా, లోటస్ ఆధ్యా డైరెక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు, రుద్ర కళాక్షేత్రం కార్యదర్శి మాచిరాజు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, తదితరులు